సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

జీఐఎస్ జోష్



జీఐఎస్ ఆర్చ్ వద్ద యువతుల సెల్ఫీ ముచ్చట

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)–2023 కొత్త శోభను తీసుకొచ్చింది. ఏయూ మైదానం వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సు విద్యార్థులు, స్థానికుల్లో ఉత్సాహం నింపింది. దేశ, విదేశాల నుంచి దిగ్గజ కంపెనీల ప్రతినిధులు సదస్సుకు తరలిరావడంతో ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి సదస్సులు జరిగినా.. అవేవీ దీనికి సాటిరాలేదంటూ స్థానికులు గర్వంగా చెప్పుకుంటున్నారు.



సదస్సుకు హాజరైన ప్రతినిధులతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రత్యక్షంగా చూద్దామనే..

గత సదస్సులకు పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. ఈ సారి దేశానికే తలమానికంగా నిలుస్తున్న కంపెనీల అధినేతలే నేరుగా హాజరుకావడంతో వారిని చూసేందుకు స్థానికులు, విద్యాధికులు, వివిధ ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు చెందినవారు ఆసక్తిగా ఏయూ మైదానం వద్ద నిరీక్షించారు. రిలయన్స్, అదాని, జిందాల్, టాటా, బిర్లా, అపోలో తదితర లబ్ధప్రతిష్ట సంస్థల అధినేతల్ని ప్రత్యక్షంగా చూసేందుకు పరుగులు తీశారు. ఏయూ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగుల ఆనందం అంబరాన్నంటింది.

విద్యార్థుల్లో ఉత్సాహం



నగరంతో పాటు ఇతర జిల్లాల నుంచి పలువురు మేనేజ్‌మెంట్ విద్యార్థులు సమ్మిట్ జరుగుతున్న ప్రాంగణానికి విచ్చేశారు. సదస్సుకు వచ్చిన పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులతో మాట్లాడారు. ఇంటర్న్‌షిప్‌లు సాధించే దిశగా వీరు తమ సామర్థ్యాలతో వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ సదస్సును విద్యార్థులు ప్రత్యక్ష నైపుణ్య శిక్షణ కార్యక్రమంగా మార్చుకుని, తమకు తామే మార్కెటింగ్ చేసుకుని అబ్బురపడ్డారు.

వెల్లివిరిసిన సంప్రదాయం



సమ్మిట్‌కు దేశ, విదేశీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలువురు భారతీయ మహిళలు సంప్రదాయ చీరకట్టులో సమ్మిట్‌కు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మరికొంత మంది యువతులు కార్పొరేట్ లుక్‌తో తళుక్కుమన్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులైతే తమకు స్ఫూర్తినిచ్చే వ్యక్తుల్ని కనులారా చూడాలన్న తపనతో ఉదయం నుంచే ఏయూ మార్గంలో పడిగాపులుకాశారు. అత్యాధునిక వాహనాల్లో వస్తున్న వ్యాపార దిగ్గజాలను చూస్తూ ఆనందగా చేతులూపుతూ జేజేలు పలికారు.



'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాలాపన



సదస్సుకు హాజరవుతున్న ప్రతినిధులు



ఆసక్తిగా లేజర్ షో తిలకిస్తున్న దేశ, విదేశీ ప్రతినిధులు

ఏర్పాట్లు భేష్

సమావేశాలు జరిగిన ప్రాంగణాలలో శీతలీకరణ యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భారీ జనరేట్లను వినియోగించి నిరంతరాయంగా ఏసీలు పనిచేసేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఇతర ప్రాంతాలు, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు.

కూల్..కూల్..

సమావేశాలు జరిగిన ప్రాంగణాల్లో భారీ జనరేటర్లను వినియోగించి ఏసీలు పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో ఇతర ప్రాంతాలు, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు.

అరకు కాఫీకి ఫిదా

ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌కు అత్యంత ఆదరణ లభించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో అరకు కాఫీ స్టాల్‌ను సందర్శించారు.

సందడిగా సమ్మిట్ ప్రాంగణం

ఉదయం 8 గంటల నుంచే సమ్మిట్ ప్రాంగణానికి ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు చేరుకోవడం ప్రారంభమైంది. వీరికి వివిధ ప్రవేశ మార్గాల నుంచి లోపలకు అనుమతించారు. ప్రధాన వేదిక వద్దకు గుర్తింపు కార్డులు ఉన్న వారికి మాత్రమే ప్రవేశం కల్పించారు. సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు ఏర్పాట్లన్ను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



సమ్మిట్ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శ్రమించారు. ఎక్కడైనా చిన్న స్పూన్, వాటర్ బాటిల్ కనిపించినా వెంటనే ఏరివేశారు. ప్రాంగణాన్ని నిరంతరం శుభ్రం చేస్తూ అత్యంత సుందరంగా నిలిపారు.

క్లుప్తంగా

50 మందికి వినికిడి పరికరాల పంపిణీ



వినికిడి పరికరాలు అందిస్తున్న దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమం ఈఎన్‌టీ ఆస్పత్రిలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ విటల్ మాట్లాడుతూ పేదవారి కోసం ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. వినికిడి సమస్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. 52 మందికి ఉచితంగా వినికిడి పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రామాంజనేయులు, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలందుకున్న కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ సేవలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల దంపతులను అనుమతించనున్నట్లు ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 8985515989 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు



శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తునందు భయభక్తులు కలిగి జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు ఘనంగా పరిశుద్ధ శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అదే జ్ఞానానికి మూలమని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో సూచించబడిందన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్దిలపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4లో శనివారం ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని సెబ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని ఆయన కోరారు.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద 14 గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, ఎస్ఐజీ నగర్, రవీంద్ర నగర్ తదితర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ నెల 7న జరగనున్న అమ్మవారి జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాచారమ్

'దినచర్యలో తత్వశాస్త్ర అధ్యయనం భాగం'



ఆచార్య రజనిని సత్కరిస్తున్న ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: తత్వశాస్త్ర అధ్యయనం మానవుని దినచర్యలో భాగం కావాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. శుక్రవారం ఏయూ తత్వశాస్త్ర విభాగంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫీ రీసెర్చ్ న్యూఢిల్లీ సహకారంతో ×భారతీయ సంస్కృతికి అరవిందుని దృక్పథం®అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం ఒక సాధనంగా చేసుకుంటే మానవులు తమను తాము అర్థం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని తాత్విక సంపద భారత్‌కు ఉందన్నారు. దీనిని పొందడం కోసం ప్రపంచ దేశాలు భారతీయ సంస్కృతిపై ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. ప్రధాన ఉపన్యాసకురాలు, ఐసీపీఆర్ సీనియర్ ఫెలో విశ్రాంత ఆచార్యులు కె.ఆర్.రజిని మాట్లాడుతూ సమస్యలను అధిగమించడానికి పూర్ణ యోగాను ప్రజలంతా అలవాటు చేసుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, విశ్రాంత ఆచార్యులు ఎం.వి.కృష్ణయ్య, ఆచార్య రవిబాబు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- జోన్–3లో 10 కేంద్రాల ఏర్పాటు
- బయోమెట్రిక్, చిరునామా వివరాల అప్‌డేషన్‌కు అవకాశం



దొండపర్తి 143 సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న కార్యదర్శి

సీతంపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన వారు బయోమెట్రిక్, చిరునామా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల సమాచారం తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ జోన్–3 పరిధిలోని 10 వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవలు పొందవచ్చు. దొండపర్తి నెహ్రూ బజార్ రోడ్డులోని 143 సచివాలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రంలో ఎప్పుడైనా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవచ్చు.

జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఆధార్ కేంద్రాల వివరాలు

సంఖ్య	సచివాలయం కోడ్	సచివాలయం పేరు	సెక్రటరీ పేరు	ఫోన్ నంబర్
1.	1086117	మద్దిలపాలెం-03	బోయిన నాగేశ్వరరావు	95422 66611
2.	1086110	రజక వీధి-01	ఉప్పాడ ఆదిసోంబాబు	94940 82506
3.	1086163	రెల్లిపేట కాలనీ	పిడింట్ల సాయికుమార్	70134 26964
4.	1086125	లలితానగర్	గేది యమున	74164 90464
5.	1086154	ఇందిరానగర్-03	దన్నిన అనిల్‌కుమార్	97039 50500
6.	1086106	న్యూవెంకోజీపాలెం-02	శిరిషా యలమంచిలి	99663 42176
7.	1086150	బాలాజీనగర్-04	గొలగాని రాఘవేంద్ర	70369 33013
8.	1086143	దొండపర్తి-02	గౌరి పైలా	83176 04549
9.	1086138	పాత రేసపువానిపాలెం	దెక్కల లోవరాజు	91334 19363
10.	1086149	పిఠాపురం కాలనీ	పెద్దింటి హరిత	99488 85933

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపై ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిదీ



జూలో పక్షులను తిలకిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: వన్యప్రాణుల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని జూ ఇన్‌చార్జి క్యూరేటర్ అనంత శంకర్ కోరారు. ఇందిరాగాంధీ జూ పార్కులో శుక్రవారం వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు జూ పార్కును సందర్శించారు. వారంతా జూ లోపల వాక్‌థాన్ నిర్వహించి వివిధ రకాల పక్షులను పరిశీలించారు. వాటిని సెల్‌ఫోన్లు, కెమెరాలలో బంధించారు. మధ్యాహ్నం తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అనంత్ శంకర్ అవగాహన కల్పించారు. పర్యావరణంలో ఉన్న వన్యప్రాణుల వైవిధ్యం మానవ మనుగడకు కీలకమన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి



సీతంరాజు సుధాకర్ మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న అక్కరమాని విజయనిర్మల



మాధవ్‌కు మద్దతుగా వాకర్స్‌కు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సత్యకుమార్ తదితరులు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/మద్దిలపాలెం : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థుల మద్దతుదారులు పోటాపోటీగా పర్యటిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిల్చున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శుక్రవారం 9వ వార్డు విశాలాక్షినగర్‌లో ప్రచారం చేశారు. కార్పొరేటర్ స్వాతి, స్థానిక నాయకులతో కలసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. స్థానిక నాయకులు నాగేశ్వరరావు, కళావతి, పిట్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- సుధాకర్‌కు మద్దతుగా 10వ వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.
- 18వ వార్డులోని పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు ఓటు వేయాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పార్టీ నాయకులు ఎల్లాజీ, ధన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- వామపక్షాలు బలపరుస్తున్న అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ఆరిలోవలో ప్రచారం చేశారు. ఉదయం ముడసర్లోవ ప్రాంతంలో నడక కోసం వెళ్లేవారిని ఆమె కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.
- బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ విస్తృత ప్రచారం నిర్వహించారు. లాసన్స్ బే పార్కు, తెన్నేటి పార్కు, ఆర్కే బీచ్‌లలోని పలు ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. 16వ వార్డులో పార్టీ విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు స్థానిక నాయకులతో కలసి పట్టభద్రులైన ఓటర్ల ఇళ్లకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.

ఏఐటీయూసీ ప్రచారం

మద్దిలపాలెం : ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోసం హెచ్‌బీ కాలనీలో శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. తొలి ప్రాధాన్యత ఓటు రమాప్రభకు వేయాలని కోరారు.



రమాప్రభ కోసం హెచ్‌బీ కాలనీలో ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం స్మార్ట్‌సిటీ లయన్స్‌క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎం త్రినాథరావు, కార్యదర్శి వి. వల్లీకుమారి, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, చెన్నా తిరుమలరావు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వైద్య శిబిరంలో షుగర్, బీపీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులచే ఈ ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9395111133 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

మహిళా రైతు నిజాయితీ

రైతుబజార్‌లో దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత



వినియోగదారుడు గోపీకి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న రైతు అచ్చియ్యమ్మ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌కు చెందిన ఓ మహిళా రైతు తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను సంబంధిత వ్యక్తికి అందించి నిజాయితీని చాటుకున్నారు. వివరాలిలా.. డాబాగార్డెన్స్‌కు చెందిన గోపీ అనే వినియోగదారుడు శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చాడు. రూ.15 వేల విలువ చేసే తన సెల్‌ఫోన్‌ను ఒక స్టాల్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. అది గమనించిన రైతు వ్యాపారి అచ్చియ్యమ్మ మొబైల్ ఫోన్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు అందజేశారు. వినియోగదారుడు గోపీకి సమాచారమిచ్చి పోగొట్టుకున్న ఫోన్‌ను ఆమె చేతుల మీదుగా ఈవో అప్పగించారు. అచ్చియ్యమ్మ నిజాయితీని మెచ్చుకుని పలువురు అభినందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com